క్లుప్తంగా

అగ్రి ల్యాబ్ నిర్మాణ పనుల పరిశీలన

పి.గన్నవరం: పోతవరం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్ భవన నిర్మాణ పనులను వ్యవసాయ శాఖ జేడీ వి.బోసుబాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వీఏఏలతో ఆయన మాట్లాడారు. యాప్‌ల నిర్వాహణపై పలు సూచనలిచ్చారు. ఆయన వెంట ఏడీఏలు జేఎస్‌వీ రామ్మోహన్‌రావు, రాజశేఖర్, ఏఓలు మురళీ, మనోహర్ తదితరులు ఉన్నారు.

హెచ్‌ఎంగా సాయిరామ్

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా కడలి సాయిరామ్ ఉద్యోగ బాధ్యతలను బుధవారం చేపట్టారు. అల్లవరం జెడ్పీ హైస్కూల్‌లో పీజీటీ బోటనీ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ హెచ్‌ఎంగా పదోన్నతిపై ఇక్కడకు వచ్చినట్టు ఆయన తెలిపారు. ఇక్కడ పనిచేసిన హెచ్‌ఎం మోకా ప్రకాష్ అంబాజీపేట మండల ఎంఈఓ-2గా నియమితులయ్యారు.

తాగునీటి సమస్య పరిష్కారం



మాకనపాలెంలో వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తున్న సిబ్బంది

మామిడికుదురు: తాగునీరు మురికిగా వస్తుందంటూ మాకనపాలెం గ్రామస్తులు నుంచి నిరసన వ్యక్తమైన నేపథ్యంలో గ్రామ పంచాయతీ అధికారులు ఆ సమస్యను పరిష్కరించారు. గ్రామంలోని వాటర్ ట్యాంకు సమీపంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన కుళాయి విరిగిపోయి దాని ద్వారా మెయిన్ పైప్‌లైన్‌లోకి మురుగు నీరు చేరుతున్నట్టు గుర్తించి, అక్కడ పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. గేట్‌వాల్ వద్ద బ్లీచింగ్ చల్లించి పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామంలో తాగునీరు సరఫరా చేస్తున్న ట్యాంకులోని నీటి పూర్తిగా బయటకు పంపించి దాన్ని పరిశుభ్రం చేశారు. గ్రామ సర్పంచ్ మద్దాల బాబూరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి డి.సురేష్ పర్యవేక్షణలో పనులు నిర్వహించారు.

బీజామృతంతో విత్తన శుద్ధి

అంబాజీపేట: విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేయడం వల్ల తెగుళ్లను నివారించడమే కాకుండా అధిక దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్ జనిపల్లి నాగవేణి అన్నారు. ఇరుసుమండలో బీజామృతంతో విత్తన శుద్ధిపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవేణి మాట్లాడుతూ భూమి నుంచి సంక్రమించిన తెగుళ్లు, విత్తనం నుంచి సంక్రమించే తెగుళ్లు, అగ్గి, పొడ తెగుళ్లు రాకుండా నివారించవచ్చన్నారు. 75 కిలోల 1318 రకం వరి విత్తనాలు బీజామృతంతో ముగ్గురు వరి రైతులతో విత్తన శుద్ధి చేయించామన్నారు. ఇరుసుమండ విలేజ్-1ఐసీఆర్పీ ఎం.దుర్గా భవాని, రైతులు ఎంఎస్‌వీ సూర్యప్రసాద్‌బాబు, ఆర్.సత్యవతి, మారే వెంకటరత్నం, బి.నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువ పూడికతీత పనులు



పెనికేరులో పొక్లెయిన్‌తో పూడిక తీస్తున్న కూలీలు

ఆలమూరు: పెనికేరులో పంట కాలువ పూడికతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. పంట కాలువలో గుర్రపుడెక్క, వ్యర్థాలు పేరుకుపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందులకు చూసిన సర్పంచ్ వనుం చిన్నావతి స్పందించారు. గ్రామ పంచాయతీ సహకారంతో తమ సొంత నిధులు వెచ్చించి స్థానిక ఓఎన్‌జీసీ రిగ్ వద్ద నుంచి గుమ్మిలేరు వరహాల కాలువ వరకు సుమారు రెండు కిలోమీటర్ల మేర పొక్లెయిన్, కూలీల సాయంతో పంటకాలువ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ కాలువ ద్వారా సుమారు 800 ఎకరాలకు సాగునీరు అందుతుందని సర్పంచ్ చిన్నావతి తెలిపారు.

పారదర్శకంగా సర్వే చేయాలి

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులై ఉండి పొందలేని వారిని గుర్తించేందుకు పారదర్శకంగా సర్వే చేయాలని ఎంపీడీఓ కె.సత్యనారాయణ, తహసీల్దార్ టి.మంగతాయారు అన్నారు. మొసలపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి లబ్ధిదారుల వివరాలను సేకరించాలన్నారు.

కవల పిల్లల వైద్యానికి సాయం

రావులపాలెం: నెలలు నిండకుండా ప్రసవించిన బాలింతకు, తనకు పుట్టిన కవల పిల్లల వైద్యం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను బాలింత స్నేహితురాలు సాయం కోరింది. కొత్తపేట గ్రామానికి చెందిన షేక్ మున్నిసా గర్భిణీ, ఏడో నెలలో ఉమ్మనీరు పోవడం వైద్యులు డెలివరీ చేయాల్సి వచ్చింది. ఇద్దరు కవల పిల్లలకు మున్నిసా జన్మనిచ్చింది. ఏడో నెలలో పుట్టిన ఇద్దరు పిల్లలను తొమ్మిదో నెల వచ్చే వరకూ బాక్స్‌లో ఉంచి వైద్యం చేయించాలని వైద్యులు చెప్పారు. రోజుకు రూ.15 వేల వరకు ఖర్చవుతుందన్నారు. దీంతో కాశీఅన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను మున్నిసా స్నేహితురాలు షణ్ముఖ సాయం కోరారు. బుధవారం వారు ఆమెకు రూ.17 వేల నగదును అందజేశారు.

‘జగనన్న సురక్ష’తో సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం
- లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాల అందజేత



మొగలికుదురులో లబ్ధిదారుకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



తూర్పుపాలెంలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మామిడికుదురు: సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టబడిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పెదపట్నం, మొగలికుదురు గ్రామాల్లో బుధవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పలువురికి వివిధ రకాల సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. అధికారుల వద్దకు ప్రజలు వెళ్లాల్సిన అవసరం లేకుండా వలంటీర్లే ప్రజల వద్దకు వెళ్లి వారికి అవసరమైన సర్టిఫికెట్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎమ్మెల్యే చిట్టిబాబు చెప్పారు. జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కడి అరుణకుమారి, గుబ్బల దుర్గ, ఎంపీటీసీలు కొప్పిశెట్టి దుర్గాపార్వతి, కడలి పద్మావతి, జేసీఎస్ మండల కన్వీనర్ జక్కంపూడి వాసు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నేతలు కొమ్ముల శ్రీనివాస్, తేతల మోహనరెడ్డి, తాడి శేఖర్, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన : ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన ఉంటుందని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఇరుసుమండ, తూర్పుపాలెం గ్రామాలలో జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామ సభలలో ఎమ్మెల్యే పాల్గొని వివిధ ధరకాస్తు దారులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. డీసీ ఎంఎస్ డైరెక్టర్ అడబాల వీర బ్రహ్మాజీరావు, తహసీల్దారు జి.వి.నరసింహరావు, ఎంపీడీఓ ముత్యం వీరా స్వామి నాయుడు, చింతా రాజబాబు, అశోక్, సర్పంచ్‌లు వలవల అమ్మాజీ, సత్తిబాబు, ఎంపీటీసీ ఒగ్గ సుబ్బారావు, ఎలక్ట్రికల్ ఏఈ ఎం.సతీష్, నాయకులు నల్లి సత్యం, అడబాల చినబాబులు, సెక్రటరీ ఎస్‌డీఎస్ ప్రసాద్ గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ఆలమూరు: రాష్ట్రంలోని అర్హులందరికీ పథకాలతో పాటు సత్వర సేవలను అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జిలు తమ్మన శ్రీనివాస్ నామాల శ్రీనివాసు అన్నారు. మండలంలోని బడుగువానిలంక, సూర్యారావుపేట గ్రామాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్‌లు దూలం వెంకటలక్ష్మి, చింతపల్లి వెంకటలక్ష్మి ఆధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ ఐపి.శెట్టి, ఎంపీడీఓ కె.జాన్ లింకన్ నేతృత్వంలో రెండు అధికార బృందాలు ఏర్పడి 11 రకాల సత్వర సేవలను అందించారు.

రావులపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వేమన కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ బిల్డింగ్‌లో సచివాలయాలు 3, 4 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, మాజీ ఎంపీటీసీ కర్రి వీర్రెడ్డి, ఎండీపీఓ రాజేంద్రప్రసాద్, తహసీల్దారు బి.మృత్యుంజయరావు, ఏఓ మీనా, కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధి

- డీఆర్‌డీఏ పీడీ శివశంకరప్రసాద్
- గంటి, కొత్తపేట సచివాలయం ద్వారా 1400 మందికి ధ్రువీకరణ పత్రాల జారీ



గంటి జగనన్న సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీ ప్రసాద్

కొత్తపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని డీఆర్‌డీఏ పీడీ వీ శివశంకరప్రసాద్ అన్నారు. మండలంలో గంటి, కొత్తపేట సచివాలయం-5 పరిధిలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామ సర్పంచులు సాగి బంగారాజు, బూసి జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీడీ శివశంకరప్రసాద్, అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఏ ప్రభుత్వం ఇలా లబ్ధిదారుల వద్దకు వెళ్లి పథకాలు అందించలేదని, ఈ ప్రభుత్వమే పేదల గురించి ఆలోచిస్తోందన్నారు. పేదల అభివృద్ధే లక్ష్యం ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందన్నారు. సురక్ష కార్యక్రమంలో 11 రకాల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించి గంటిలో 400 మందికి, కొత్తపేటలో వెయ్యి మందికి సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు ముళ్ల జనార్దనరావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మట్టపర్తి వెంకట్రావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు భూపతిరాజు సత్యనారాయణరాజు, పోలుమాటి అంజనీకుమారి, యడ్ల కృష్ణమూర్తి, పంతగాని శామ్యూల్, మండల సర్పంచ్ సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, అవిడి, ఖండ్రిగ, మోడేకుర్రు సర్పంచ్‌లు సర్పంచ్‌లు రెడ్డి చంటి, దూనబోయిన నవదీప, కుడుపూడి రామలక్ష్మి, ఎంపీడీఓ ఇ.మహేశ్వరరావు, డీటీ ఎస్ శ్రీనివాస్, ఆర్ఐ కె.ఏడుకొండలు, ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ ఎస్ రెడ్డి నాయుడు, గ్రామ కార్యదర్శులు వీవీ రామన్, డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పందులను అరికట్టాలి



అరటి మొక్కను అధికారులకు చూపుతున్న రైతులు

అంబాజీపేట: కొబ్బరి తోటల్లో అంతర పంటలుగా వేసుకున్న అరటి తోటలను పందులు స్వైర్య విహారం చేసి ధ్వంసం చేస్తున్నాయి, తక్షణమే వాటిని అరికట్టాలని మాచవరం ధరణీ రైతు సమాఖ్య కోరింది. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసి, ధ్వంసమైన పంటలను బుధవారం అధికారులకు చూపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ లక్షలాది రూపాయలు పెట్టుబడి అరటి పంటను వేస్తే అరటి దుంపలతో పెకలించి తీవ్ర నష్టాన్ని కలుగచేస్తున్నాయన్నారు. దీనిపై పలు మార్లు అధికారులకు వివరించినా పట్టించుకోలేదన్నారు. నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇప్పించి, పందులను అరికట్టాలని శ్రీధరణీ రైతు సమాఖ్య సభ్యులు కోరారు.

పెంపుడు జంతువులకు టీకాలు

ఆలమూరు: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా మండలంలోని పశువుల ఆస్పత్రుల్లో పెంపుడు జంతువుల(కుక్కలు)కు గురువారం ఉచితంగా ర్యాబిస్ టీకాలు అందజేస్తామని పశుసంవర్థక శాఖ ఏడీ ఎల్.అనిత తెలియజేశారు. స్థానిక ఏడీఏ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ జంతువులకు అందించే టీకాలు ప్రతి పశువుల ఆస్పత్రికి చేరుకున్నాయన్నారు.

నేడు కుక్కలకు వ్యాక్సిన్

అంబాజీపేట: పెంపుడు కుక్కల నుంచి ఎటువంటి రోగాలు ప్రబల కుండా ముందస్తుగా రాబిస్ వ్యాక్సిన్‌ను అంబాజీపేట పశువైద్యశాలలో గురువారం వేయనున్నట్టు పశువైద్యాధికారి డి.రాజేంద్ర తెలిపారు. మండలంలోని పెంపుడు కుక్కలకు తప్పని సరిగా వ్యాక్సిన్ వేయించాలన్నారు. దీనిపై ఎవ్వరూ అశ్రద్ధ చేయవద్దన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పథకాలు

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి
- చింతలూరులో 'గడప గడపకూ'



పభుత్వ పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. బుధవారం చింతలూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, జగనన్న సురక్ష ఇన్‌చార్జి నామాల శ్రీనివాస్, సర్పంచ్ మార్గని కరుణ, వైస్ ఎంపీపీ నేలపూడి రత్నకుమారిలతో కలిసి ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి గ్రామంలో ప్రతి ఇంటికీ పలకరించి ప్రభుత్వ పథకాలను వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పేదల కోసం కృషి చేస్తున్న ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఎంఏఎంఎస్ అధ్యక్షుడు యనమదల నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు నెక్కంటి వెంకట్రాయుడు, మోటుపల్లి వెంకన్న, సర్పంచ్ చిన్నావతి, శ్యామల, యేడిద సత్యశ్రీ, ఎంపీటీసీలు సునీత, స్వాతి పాల్గొన్నారు.

అర్హత ప్రామాణికంగా సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

పి.గన్నవరం: కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. నాగుల్లంక గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు మంగం చిట్టిబాబు, కారుపల్లి శ్రీను, బొక్కా ఏడుకొండలు, చికిలే వెంకటేశ్వరరావు, చికిలే ప్రసాద్ తదితరులతో చిట్టిబాబు ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలిజేశారు. జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న జగన్‌ను ఆశీర్వదించాలని ప్రజలను చిట్టిబాబు కోరారు. నాయకులు పితాని నర్సింహరావు, యన్నాబత్తుల నాగభూషణం, దొమ్మేటి దుర్గారావు, యల్లమెల్లి శ్రీను, ముడకల ఏసురత్నం, పిల్లి నర్సింహరావు, పిల్లి రమణ, గ్రంధి సోమేశ్వరరావు, జోగి సత్యనారాయణ, గొల్లమండల మలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యం బాగుండాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. బుధవారం మోరిలో ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రాపాక గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ పి.లక్ష్మీపద్మ మంగతాయారు, ఎంపీటీసీ జాన లక్ష్మీ దుర్గ సూర్యావతి, వీవర్స్ సొసైటీ చైర్మన్ జాన శంకరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ముప్పర్తి త్రిమూర్తులు, శివాలయ దేవస్థానం చైర్మన్ జాన సునీల్, నాయకులు గెద్దం అమ్ములు, వలవల రాంబాబు, పీ.భగవాన్ శ్రీనివాస్, కొల్లాబత్తుల చిట్టిబాబు పాల్గొన్నారు.

గ్రామీణులకు అందుబాటులో పౌరసేవలు

ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి



సచివాలయం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జగ్గిరెడ్డి

ఆలమూరు: గ్రామీణాభివృద్ధితో రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందనే ఉద్దేశంతో ప్రజలకు ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలతో పాటు సత్వర సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కలవచర్లలో సుమారు రూ.68.1 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన పౌర సేవలను అందించేందుకు వీలుగా ప్రతి గ్రామంలోను జనాభా ప్రాదిపతికన గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మిస్తున్నామన్నారు. గ్రామాభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని మెయిన్‌రోడ్డులో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కురుపూడి లోవ సత్యనారాయణ సుమారు రూ.30వేలు తన సొంత నిధులతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

అరుణాచల యాత్రకు ప్రత్యేక బస్సు

రావులపాలెం: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి బుధవారం అరుణాచల యాత్రకు ప్రత్యేక బస్సు బయలు దేరినట్టు డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ తెలిపారు. వెదిరేశ్వరం గ్రామానికి చెందిన భక్తుల బృందం బస్సును బుక్ చేసుకున్నారని దీంతో అరుణాచలం యాత్రకు సూపర్ లక్సరీ బస్సు బయలుదేరిందని డిపో మేనేజర్ తెలిపారు.

విద్యాభివృద్ధికి సర్కారు కృషి

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- గ్రామాల్లో అమ్మఒడి కార్యక్రమం
- పి.గన్నవరం మండలంలో 6236 మందికి లబ్ధి
- రూ.9.35 కోట్ల నమూనా చెక్కు పంపిణీ



పి.గన్నవరంలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: పేదల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాల అమలు చేస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. అమ్మఒడి పథకం కింద మండలంలోని 6236 మంది విద్యార్థులకు మంజూరైన రూ.9.35కోట్ల చెక్కును స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో చిట్టిబాబు అందజేశారు. ఎంఈఓ కోన హెలీనా అధ్యక్షతన జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. అనంతరం స్థానిక సొసైటీ తరపున పాఠశాలకు రూ.50 వేల విరాళాన్ని అందించిన సొసైటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్‌ను ఎమ్మెల్యే చిట్టిబాబు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు, హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్ అభినందించారు. ఎంపీపీ అంబటి భూలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నక్కా కృష్ణవేణి, కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు దంగేటి అన్నవరం, నూకపెయ్యి ప్రసన్నకుమార్, ఎంపీటీసీ దాసరి మౌనిక, నాయకులు కుంపట్ల గోపి, దాసరి కాశీ, పెచ్చెట్టి రాంబాబు, ఎస్సై హరికోటి శాస్త్రి, ఎంఈఓ 2 చింతా వీరభద్రుడు తదిరులు పాల్గొన్నారు.

చింతలమోరిలో..



చింతలమోరిలో అమ్మఒడి నమూనా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: చింతలమోరి హైస్కూల్‌లో జరిగిన జగనన్న అమ్మఒడి కార్యక్రమంలో ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పాల్గొని మాట్లాడారు. అనంతరం అమ్మఒడి నమూన చెక్కును అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యావాణి, ఎంఈఓ ఎం.విజయశ్రీ, ఎంపీటీసీ తోటి రాజేష్, నాయకులు సుంకర బాబ్జి, బోనం వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సేవలు, పథకాలకు ఆకర్షితులైన కె.జగన్నాథపురం, తొత్తరమూడి, మాగాం గ్రామాలకు చెందిన 30 మంది టీడీపీ పార్టీని వీడీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీలోకి చేరిన వారిలో నేదునూరి ధనరాజు, సాకా గిరిబాబు, నేదునూరి లక్ష్మీనారాయణ, లక్ష్మి, శ్రీనివాసరావు, రాంబాబు, ఓవేన్ నలీన్, సిద్దు, నాగమల్లీశ్వరి, నేదునూరి దుర్గావాణి తదితరులు ఉన్నారు. ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, అంబాజీపేట మార్కెట్ కమిటీ మాజీ డెరెక్టర్ చెట్ల రామరావు, కె.జగన్నాథపురం ఉపసర్పంచ్ ఆకుమర్తి దుర్గారావు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు దాతల సాయం

పి.గన్నవరం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అందరూ సహకరించాలని ముంగండ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు అన్నారు. ఈ పాఠశాలకు బుధవారం భమిడి వీవీఎస్ భాస్కరరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి సుభద్ర రూ.18 వేల విలువైన మైకు, సౌండ్ సిస్టమ్, పెంటపాటి శ్రీనివాస్, పాటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ముద్రగళ్ల కోటయ్య, పినిశెట్టి వెంకటేశ్వరరావులు రూ.8 వేల విలువైన నాలుగు సీలింగ్ ఫ్యాన్లను అందజేశారు. నూలు సత్యమోహన్ రూ.5వేల విలువైన వంట పాత్రలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై ఎం. వెంకటరమణ బుధవారం తెలిపారు. స్థానిక అరటి మార్కెట్‌యార్డు సమీపంలో ఉదయం హైవేపై వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి పొడగట్లపల్లికి చెందిన ముగ్గురు యువకులు మోటారు సైకిల్‌పై వచ్చి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో పీతల శ్రీసుజన్(16)కు తలకు బలమైన గాయం కావడంతో రాజమహేంద్రవరం బొల్లినేని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మరో యువకుడు బండి మోజేష్‌కు గాయాలైనట్టు ఎస్సై తెలిపారు.

బీజేపీ ఇంటింటా ప్రచారం

మామిడికుదురు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన ప్రగతిని వివరిస్తూ బీజేపీ నేతలు పాశర్లపూడిలంకలో బుధవారం కరపత్రాల ద్వారా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ ఆధ్వర్యంలో నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావుతో కలిసి ఇంటింటికీ వెళ్లి మోదీ పాలనకు మద్దతుగా మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కంకిపాటి సుబ్బారావు, వేగి వెంకటేశ్వరరావు, పసుపులేటి మహాలక్ష్మీరావు, నక్కా త్రిలోచనరావు, కటికిరెడ్డి తమ్మయ్య నాయుడు పాల్గొన్నారు.

మాయ మాటలతో డ్వాక్రా మహిళకు టోకరా

పి.గన్నవరం: స్థానిక స్టేట్ బ్యాంకులో బుధవారం గుర్తు తెలియని అగంతకుడు డ్వాక్రా మహిళకు మాయ మాటలు చెప్పి రూ.34,100 తస్కరించాడు. ఎల్.గన్నవరం గ్రామంలోని డొక్కా సీతమ్మ కాలనీకి చెందిన కోదండరామా డ్వాక్రా గ్రూపు అధ్యక్షురాలు కొప్పాడి సత్యవతి రూ.33 వేలు రుణం, రూ.1100లు పొదుపు చెల్లించేందుకు బ్యాంకుకు వచ్చింది. అప్పటికే మధ్యాహ్నం కావడంతో బ్యాంకు సిబ్బంది భోజనానికి వెళ్లారు. దీంతో అక్కడే కూర్చొని ఉన్న సత్యవతి వద్దకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. ఆమెకు మాయ మాటలు చెప్పి తాను బ్యాంకు ఉద్యోగినని నమ్మించాడు. లోను పుస్తకాలు తీసుకుని డిపాజిట్ ఫారాలు పూర్తి చేసి మేనేజర్ రూమ్‌లోకి వెళ్లాడు. మళ్లీ వచ్చి ఆమె నుంచి సొమ్ము తీసుకుని మేనేజర్ రూమ్‌లోకి వెళ్లి కౌంటర్ ఫైల్‌పై స్టాంపు వేసి, ఆమెకు ఇచ్చి వెళ్లిపోయాడు. అయితే కౌంటర్ స్లిప్‌పై చిన్న స్టాంప్ వేసి ఉండడంతో ఆమెకు అనుమానం వచ్చింది. మేనేజర్ వచ్చాక కౌంటర్ స్లిప్‌లు ఆయనకు చూపించడంతో అవి నకిలీవని గుర్తించారు. దీంతో సత్యవతి విలపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై హరికోటి శాస్త్రి బ్యాంకులో సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. గుర్తు తెలియని అగంతకుడి కదలికలను, బ్యాంకు సిబ్బందితో మాట్లాడుతున్న దృశ్యాలను గుర్తించారు. బాధితురాలు సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.









బహిరంగ వేలం ప్రకటన

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అయినవిల్లి మండలం, తొత్తరమూడి గ్రామములో గల ఈ క్రింది దేవస్థానములు మరియు సత్రములకు చెందిన వయస్సు మీరిన వివిధ రకములు చెట్లు తొలగించి తీసుకుని వెళ్ళు హక్కు నకు బహిరంగ వేలం ది.12.07.2023 బుధవారం ఉ.11.00 గం.లకు శ్రీ ముక్తేశ్వర స్వామి వారి దేవస్థానం, తొత్తరమూడి వద్ద దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు సమక్షములో నిర్వహించబడును. ఆసక్తి గల వ్యాపారస్తులు ప్రథమ దరావత్తు రూ.20,000/-లు చెల్లించి బహిరంగవేలంపాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.

వ.నెం	దేవస్థానం/సత్రం పేరు	భూమి ఉన్న గ్రామం	రి.స.నెం.	చెట్లు వివరములు
1	శ్రీ ముక్తేశ్వర స్వామి వారి దేవస్థానం	తొత్తరమూడి	65/2	సిల్వర్ గన్నేరు-12, ఇతర చెట్లు -4 , మామిడి చెట్టు- 1, వేప చెట్టు - 1
2	శ్రీ పళ్ళస్వామి వారి ఛారిటీస్	తొత్తరమూడి	60/1	వేప చెట్టు - 3, సిల్వర్ గన్నేరు - 1, కుంకుడు చెట్టు - 1
3	శ్రీ శ్రీకాకోళపు కృష్ణమూర్తి సత్రం	తొత్తరమూడి	62/12	సిల్వర్ గన్నేరు - 2, రావి చెట్టు - 1, వేప చెట్టు - 1
4	శ్రీ వారణాసి సుబ్బారాయుడు సత్రం	తొత్తరమూడి	63/3	వేప చెట్టు - 1, ఇతర చెట్టు - 1

తొత్తరమూడి :
ది.25.06.2023

ఇట్లు
సం/- కార్యనిర్వహణాధికారి